మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఆనంద్‌కుమార్ గౌడ్



నందినగర్‌లో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావును గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాల గురించి చర్చించారు.
– (అబిడ్స్/మెహిదీపట్నం, నవంబర్ 8)

ఉచిత వివాహ పరిచయ వేదికను సద్వినియోగం చేసుకోవాలి

కాచిగూడ, నవంబర్ 8: ఉచిత వివాహ పరిచయ వేదికలను సద్వినియోగం చేసుకోవాలని విశ్వకర్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అడ్లూరి రవీంద్రాచారి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం విశ్వకర్మ ఫౌండేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. విశ్వకర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ యువతీయువకుల కోసం ఈనెల 10వ తేదీన భద్రాద్రి కొత్తగూడంలోని రథం కొండ అర్బన్‌పార్క్ మణుగూరులో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30గంటల వరకు వివాహ పరిచయ వేదికను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. యువతీయువకులు ఈ పరిచయ వేదికల్లో పాల్గొని వివాహ సంబంధాలు పెంపొందించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9491888266లో సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

నకిలీ ఆయిల్ విక్రేతల అరెస్ట్

కాచిగూడ, నవంబర్ 8: అమాయక ప్రజలను మభ్యపెట్టి, బ్రాండెడ్ కంపెనీ పేరుతో డబ్బులు దండుకున్న వ్యక్తులను కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ కె.చంద్రకుమార్ తెలిపిన ప్రకారం.. రాజస్థాన్ రాష్టానికి చెందిన కుకురాజ్ జకర్ (36), అదే రాష్టానికి చెందిన జవరా రామ్(28)వీరిద్దరూ కలిసి గత కొన్ని నెలలుగా ముంబైకి చెందిన ఓక్‌హర్ట్ రిజనేరేటివ్ ప్రైవేటు లిమిటెడ్ పేరుతో నకిలీ ఆయిల్ తల వెంట్రుకలు పెరగడానికి తయారు చేసిన ఆయిల్‌ను కాచిగూడలోని భూమన్నలైన్, పలు ప్రాంతాల్లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఓక్‌హర్ట్ రిజనేరేటివ్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ హర్పాల్ సింగ్ ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి, శుక్రవారం వారిని అదుపులో తీసుకొని వారి నుంచి 290 ఆయిల్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రైలు ఢీకొని కార్పెంటర్ మృతి

కాచిగూడ, నవంబర్ 8:పట్టాలు దాటుతుండగా.. రైలు ఢీకొని కార్పెంటర్ మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వేస్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ సుబ్బారావు తెలిపిన ప్రకారం.. తలబ్‌కట్ట, భవానీనగర్ ప్రాంతానికి చెందిన శంషోద్దీన్ కుమారుడు మహ్మద్ మాజిద్(35)వృత్తిరీత్యా కార్పెంటర్. గురువారం రాత్రి యాకత్‌పుర-ఉప్పుగూడ రైల్వేస్టేషన్‌ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

మహిళ అదృశ్యం

ఎ.లక్ష్మి(ఫైల్)

అంబర్‌పేట, నవంబర్ 8: ఓ మహిళ అదృశ్యమైన సంఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై జె.శ్రీనివాస్‌రావు తెలిపిన ప్రకారం..ఫీవర్ దవాఖాన పక్కన ఓ ఇంట్లో సూరన్న, అక్కిరెడ్డి లక్ష్మి నివాసముంటున్నారు. 2011లో లక్ష్మి భర్త చనిపోయాడు. 2017లో కర్నూలులోని ప్రభుత్వ దవాఖానలో సూరన్నకు లక్ష్మి పరిచయమైంది. అప్పటి నుంచి వీరిద్దరూ హైదరాబాద్‌కు వచ్చి ఓల్డ్ నల్లకుంటలో సహజీవనం చేస్తున్నారు. ఈనెల 1వ తేదీన లక్ష్మి పింఛను తెచ్చుకుంటానని చెప్పి ఏపీ సత్యసాయి జిల్లా ఎద్దులవండ్ల పల్లికి వెళ్లి తిరిగి ఈనెల 7వ తేదీన రైల్లో కాచిగూడ రైల్వే స్టేషన్‌కు రాగా.. సూరన్న లక్ష్మిని తీసుకొని తాము నివాసముంటున్న ఓల్డ్‌నల్లకుంటకు వచ్చారు. లక్ష్మిని ఇంట్లో వదిలి టిఫిన్ తీసుకొస్తానని సూరన్న బయటకు వెళ్లి తిరిగి రాగా రూముకు తాళం వేసి ఉన్నది. దీంతో ఆమె కోసం అంతటా వెతికినా ఆచూకీ లభించలేదు. రూములో ఆమెకు సంబంధించిన లగేజీ కూడా కనిపించలేదు. దీంతో వెంటనే అతడు నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అంబర్‌పేట కబేళాకు టెండర్లు వేయాలి

లీజు పొడిగింపు ఆపాలని సీపీఎం డిమాండ్

అంబర్‌పేట, నవంబర్ 8: అంబర్‌పేట కబేళాను నిర్వహించే కాంట్రాక్ట్ పీరియడ్ ఏప్రిల్-2024లో ముగిసినప్పటికీ టెండర్లు వేయకుండా లీజును పొడిగించడం అక్రమమని, ఏప్రిల్ నుంచి ఆరు నెలల పాటు పొడిగించిన జీహెచ్ఎంసీ అధికారులు మరోసారి పొడిగించడానికి ప్రయత్నిస్తున్నారని సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ అన్నారు. టెండర్లు వేయకుండా పొడిగించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. 2021 ఏప్రిల్‌లో అన్మోల్ ట్రేడింగ్ కంపెనీ అల్ ఆహద్ కంపెనీలతో కూడిన కన్సార్టియంతో మూడేళ్ల కాలానికి ఒప్పందం కుదుర్చుకున్న జీహెచ్ఎంసీ, 2024 ఏప్రిల్ కంటే ముందే టెండర్ ప్రక్రియ మొదలుపెట్టకుండా సమయం లేదంటూ లీజు పొడిగిస్తూ వెళ్తున్నారన్నారు. లీజు పొడిగింపులో పెద్దఎత్తున అవినీతి జరుగుతున్నదని ఆరోపించారు. గత కొన్నేళ్లుగా చెంగిచెర్ల కబేళాలో ఇదే రకమైన అక్రమాలు జరిగాయని, ఈ ప్రభుత్వం కూడా అంబర్‌పేటలో అదే పద్ధతి కొనసాగిస్తున్నదని విమర్శించారు. లీజు పొడిగింపు తక్షణమే ఆపాలని, టెండర్ ప్రక్రియని వెంటనే మొదలు పెట్టాలని శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బాలిక కిడ్నాప్, వ్యక్తి రిమాండ్

సుల్తాన్‌బజార్, నవంబర్ 8: ఓ బాలికను కిడ్నాప్ చేయడంతోపాటు బలవంతంగా పెండ్లి చేసుకున్న ఓ ప్రబుద్ధుడిని అరెస్టు చేసి కటకటాల్లోకి పంపిన ఘటన సుల్తాన్‌బజార్ పోలీస్ పరిధిలో శుక్రవారం వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి తెలిపిన ప్రకారం.. నల్గొండ జిల్లా మిర్యాలగూడ రూరల్ మండలం, ఆళ్లగడప గ్రామానికి చెందిన వంశీ(26)ఫొటోగ్రాఫర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కాగా, కోఠి మహిళా కళాశాలలో సూర్యాపేట ప్రాంతానికి చెందిన ఓ బాలిక డిగ్రీ చదువుతున్నది. ఇదిలా ఉండగా, బాలిక ఆళ్లగడ్డలోని తన బంధువుల ఇంటికి వెళ్లగా అక్కడ వంశీ పరిచయమయ్యాడు. ఆ పరిచయం ఇరువురి మధ్య కాస్త ప్రేమగా మారి నాలుగేండ్లు కలిసిమెలిసి తిరిగారు. కాగా, ఈనెల 2వ తేదీన బల్కంపేట ఎల్లమ్మ తల్లి దేవస్థానంలో వంశీ బాలికను వివాహం చేసుకున్నాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తును చేయగా, శుక్రవారం ఉదయం చాదర్‌ఘాట్ ఎక్స్‌రోడ్ వద్ద వంశీని అదుపులోకి తీసుకొని పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

సమగ్ర కులగణన సంక్షేమ పథకాలతో సంబంధం లేదు

- కులగణనపై బీజేపీ పార్టీ వైఖరి వెల్లడించాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

బీసీ కులగణన చైతన్య గీతం సీడీని ఆవిష్కరిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

రవీంద్రభారతి, నవంబర్ 8: సమగ్ర కులగణన సర్వేకు సంక్షేమ పథకాలతో సంబంధంలేదని బీసీ రిజర్వేషన్లు పెంచడానికి ఈ సర్వే ఉపయోగపడుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలోని సమావేశం మందిరంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కె.శ్రీను రచించిన బీసీ కులగణన చైతన్య గీతం సీడీ ఆవిష్కరణ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసి గీతం సీడీ ఆవిష్కరించారు. అనంతరం జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. కులగణన సర్వేపై బీజేపీ పార్టీ నేతలు రాద్ధాంతం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు కులగణన సర్వేను యజ్ఞం లాగా, ఉద్యమస్ఫూర్తితో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భయపడవద్దని ధైర్యంగా మన కుల మేమో తెలియజేయాలని పేర్కొన్నారు. ఈ సర్వేలో ఆర్థిక, ఉద్యోగ, విద్యా తదితర 56 ప్రశ్నలు అనుబంధ ప్రశ్నలు ఉంటాయని తెలిపారు. బీజేపీ పార్టీ బీసీల జోలికొస్తే నిప్పుల కొలిమిగా అవుతుందని హెచ్చరించారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డికి సామాజిక బాధ్యత లేదని, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, ఎంపీ డీకే అరుణ, బీజేపీ ఎల్పీ లీడర్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డిలు బీసీల మీద విషం కక్కుతున్నారని ఆరోపించారు. బీసీ అనుకూల వైఖరిపై స్పష్టమైన వైఖరిని వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. డీకే అరుణ కులగణనను అడ్డుకోవాలనే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్, కులచర్ల శ్రీనివాస్, కనకాల శ్యామ్‌కుర్మ, నేతలు ఐలి వెంకన్నగౌడ్, లింగంగౌడ్, టి.తారకేశ్వరి, సమతయాదవ్, సుజాత, వెంకటేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి

విద్యాధర్, జీహెచ్ఎంసీ 14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్

అబిడ్స్, నవంబర్ 8: సామాజిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, కుల, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు తమ సంపూర్ణ సహకారాన్ని అందించాలని జీహెచ్ఎంసీ 14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎస్ విద్యాధర్ పేర్కొన్నారు. తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. సర్వేలో 520 మంది ఎన్యుమరేటర్లతో సర్వే నిర్వహించామని, వారికి సూపర్ వైజర్లను కూడా నియమించామని, ప్రతి ఎన్యుమరేటర్ కనీసం 150నివాసాలలో సర్వే నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. మూడు రోజులపాటు ఇంటింటా స్టిక్కర్ పెట్టే కార్యక్రమం పూర్తయ్యిందని, శనివారం నుంచి ఎన్యుమరేటర్‌లు ఇంటింటికి వెళ్లి 56 ప్రధాన ప్రశ్నలతోపాటు అనుబంధ ప్రశ్నలకు సమాధానాలను నింపుకోవడం జరుగుతుందని తెలిపారు. సర్వేకు ప్రజలు తమ సహకారం అందించాలని కోరారు.

సర్వేపై బీజేపీ నేతలు తప్పుడు ఆరోపణలు మానుకోవాలి

బషీర్‌బాగ్ చౌరస్తావద్ద విలేకరులతో మాట్లాడుతున్న విక్రమ్‌గౌడ్

రవీంద్రభారతి, నవంబర్ 8: సమగ్ర కులగణన ఒక మహాయజ్ఞం లాంటిందని 1931లో బ్రిటిష్ వారు తీసిన లెక్కలే, 100 ఏండ్లు గడుస్తున్నా నేటికి బీసీల లెక్కలులేవు, దీనివల్ల బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో తీవ్రంగా నష్టపోతున్నారని బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్ అన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్ చౌరస్తాలో బీసీ సంక్షేమ సంఘం విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో కులగణనపై బీజేపీ ఎల్పీనేత ఏలటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడిన తీరును నిరసిస్తూ మహేశ్వర్‌రెడ్డి వెంటనే బీసీలకు క్షమపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వల్ల బీసీలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల జనాభా లెక్కలు తేలితే రాష్ట్ర జనాభాలో దాదాపు 55శాతం ఉంటారు కాబట్టే వారి రాజకీయ భవిష్యత్‌కు ఎక్కడ ఇబ్బంది అవుతుందోనని బీజేపీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ కులగణనపై వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని, ఇది సరి కాదని ఆయన చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, లింగంగౌడ్, నర్సింహ నాయక్, రాజేందర్ గంగపుత్ర, ఇంద్రమ్ రజక, మహేశ్, బీసీ విద్యార్థి యువజన నాయకుడు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలి

ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ సంపత్‌కుమార్, సీఐ శ్రీనివాస్,సిబ్బంది

కాచిగూడ,నవంబర్ 8: వాహనదారులు ట్రాఫిక్ పోలీసులు సూచించిన ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం కాచిగూడలో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి, హెల్మెట్ వాడకం, ఓవర్‌టేక్, రాంగ్‌రూట్‌లో వెళ్లడం, ట్రిబుల్ రైడింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ మాట్లాడుతూ.. హెల్మెట్ వాడకపోతే జరిగే పరిణామాలను వివరించారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు చేపడుతున్న చర్యలకు ప్రజలు సహకరించాలన్నారు. రోడ్లపై వాహనాలు నడిపేవారు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ఎటువంటి ప్రమాదాలు జరుగవని, ముఖ్యంగా యువత ఓవర్ స్పీడ్‌లో వెళ్లడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసే వారు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. రోడ్డు ప్రమాదాలను రూపుమాపే దిశగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా రూల్స్ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై శ్రీకాంత్, ఏఎస్సై అనిల్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

లంగర్‌హౌస్‌లో స్పెషల్ డ్రైవ్

ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేయడానికి ట్రాఫిక్ పోలీసులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఈ మేరకు లంగర్‌హౌస్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలను నడుపుతున్న వాహనదారులకు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా చలాన్లు వేయడమే కాకుండా కౌన్సెలింగ్ చేసి హెల్మెట్‌లు పెట్టుకోవాలని సూచించారు. – మెహిదీపట్నం, నవంబర్ 8

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 8:గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను నాంపల్లి రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. రైల్వే పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... లింగంపల్లి రైల్వేస్టేషన్ ప్రాంగణంలో గురువారం రాత్రి తనిఖీలు చేపట్టిన తమ సిబ్బందికి మహారాష్ట్రకు చెందిన హనుమంత్ అనిల్ సోనన్నే(26) హన్మకొండ కాజీపేట నుంచి కర్నాటక రాష్ట్రం కళ్యాణ్‌కు 16కిలోల గంజాయి విలువ సుమారు రూ.4లక్షల 13,625లను బ్యాగులలో తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. కాగా, ఈ కేసుకు సంబంధించిన వికాస్ పరారీలో ఉన్నట్లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు

అయ్యప్పలకు అన్నదానం

కార్వాన్ నియోజకవర్గం గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కృష్ణాగౌడ్, తన తల్లి కందివనం అంతమ్మతో కలిసి కార్తిక మాసం మొదటి శుక్రవారం పురస్కరించుకుని పుప్పాల్‌గూడ కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో అయ్య ప్ప స్వాములకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.
– మెహిదీపట్నం, నవంబర్ 8

12న కార్తికమాస వైభవం

రవీంద్రభారతి, నవంబర్ 8: తెలుగు భాషా సాంస్కృతిక శాఖ, సీల్‌వెల్ కార్పొరేషన్, శ్రుతిలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో సీల్‌వెల్ సుస్వరాలు, గురు శిరోమణి శ్రీఆదిత్య పరాశ్రీ స్వామిజీకి గురువందనం కార్యక్రమం ఉంటుందని సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బండారు సుబ్బారావు, శ్రుతిలయ ఎండీ భీమ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆమని ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ చైర్మన్ జి.చిన్నారెడ్డి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కోలేటి దామోదర్‌గుప్త విచ్చేయనున్నట్లు చెప్పారు. అనంతరం గానకోయిల పి.సుశీలమ్మ 89వ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని నవరస గాయన ఆమని బృందంచే పి.సుశీల సినీ హిట్స్, భక్తిరసామృతం కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

ఆకట్టుకున్న దీపికారెడ్డి కూచిపూడి నృత్యరూపకం

సౌంత్‌ఇండియా ఆర్ట్స్ కల్చరల్ (సికా) 66వ వార్షికోత్సవం సందర్భంగా దీపాంజలి సమర్పణలో శుక్రవారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో ప్రముఖ కూచిపూడి నృత్యగురువు పూర్వ సంగీత నాటక అకాడమీ చైర్మన్ దీపికారెడ్డి విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి రుక్మిణి కృష్ణ కూచిపూడి నృత్య రూపక ప్రదర్శన వీక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నది. దీపాంజలి స్కూల్ ఆఫ్ డ్యాన్స్ ఫౌండర్, దీపికారెడ్డి రుక్మిణి కృష్ణ వేషధారణలో నిర్వహించిన కూచిపూడి నృత్యరూపకం వీక్షకులను మైమరిపింపజేసింది.
– రవీంద్రభారతి, నవంబర్ 8

టీఆర్టీ వెల్ఫేర్ అసోసియేషన్‌కు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలి

మాట్లాడుతున్న వన్నాడి రమేశ్, మహ్మద్ యూసుప్

అంబర్‌పేట, నవంబర్ 8: నల్లకుంట డివిజన్ టీఆర్టీ వెల్ఫేర్ అసోసియేషన్‌కు తక్షణమే ఎన్నికలు నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని కాలనీ ప్రతినిధులు వన్నాడి రమేశ్ కురుమ, మహ్మద్ యూసుఫ్ డిమాండ్ చేశారు. శుక్రవారం టీఆర్టీ కాలనీలో వారు మీడియాతో మాట్లాడుతూ..కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌కు 2012లో ఎన్నికలు జరిగాయని, ఆ తరువాత మూడేళ్లకు అసోసియేషన్‌కు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా తొమ్మిదేళ్లు అవుతున్నా ఎన్నికలు జరిపించడంలేదని ఆరోపించారు. అప్పటి కార్యవర్గం పదవీకాలం ముగిసినా ఇంకా వాళ్లే తాము కాలనీ అధ్యక్షులమని చలామణి అవుతూ అక్రమ వసూళ్లు, అరాచకాలకు పాల్పడుతున్నారన్నారు. కాలనీలో ఎవరైనా కొత్త ఇల్లు కట్టాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. అదేవిధంగా దేవాలయం పేరు చెప్పి భవన నిర్మాణదారుల వద్ద భారీగా డబ్బులు డిమాండ్ చేస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. వేర్వేరు పేర్లతో నంబర్లు మార్చి ఫోన్ చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. విద్యానగర్ రైల్వేస్టేషన్ పక్కన ఉన్న కాలనీ కమ్యూనిటీహాల్ గుప్పిట్లో పెట్టుకొని ఇష్టారాజ్యంగా అద్దెలకు ఇచ్చుకుంటూ అక్రమ వ్యాపారం చేస్తున్నారని మండిపడ్డారు. కాలనీలోని లైబ్రరీ, ఎక్సైజ్ రూమ్‌ను కూడా కొందరు కబ్జా చేశారని ఆరోపించారు. వీరి ఆగడాలకు అడ్డు పడాలంటే కాలనీ పెద్దలందరూ స్పందించి కాలనీ అసోసియేషన్‌కు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయమై తాము కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, జీహెచ్ఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్, పోలీసు అధికారుల దృష్టికి తీసుకొని వెళ్తామని తెలిపారు.

ఆధ్యాత్మిక భావాలతో మనిషికి మానసిక ప్రశాంతత

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కి కరపత్రాలను అందజేస్తున్న ఈశా ఫౌండేషన్ ప్రతినిధి

అబిడ్స్, నవంబర్ 8: ఆధ్యాత్మిక భావాలతో మనిషి మానసిక ప్రశాంతత పొందుతాడని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. యాంత్రిక జీవనంలో మానవాళి మానసిక ఆనందంగా ఉండేందుకు గాను యోగాసనాలు, మెడిటేషన్ లాంటి ఆరోగ్య ప్రక్రియలను నిత్యం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. శుక్రవారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో కొనసాగుతున్న హిందూ స్పిరిట్యుయల్ అండ్ సర్వీస్ ఫెయిర్‌లో పాల్గొని ఈశా ఫౌండేషన్ ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఈశా ఫౌండేషన్ ప్రతినిధులు ప్రియదర్శిని, నవ్య, రాజ్యలక్ష్మి, యజ్ఞులు బండి సంజయ్‌కు కరపత్రాలను అందజేశారు.

దివ్యాంగుల కమిటీని అభినందించిన ఎమ్మెల్యే కాలేరు

అంబర్‌పేట నియోజకవర్గం దివ్యాంగుల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా ఎం.భిక్షపతి, ఉపాధ్యక్షుడిగా బాబురావు, మహిళా అధ్యక్షులుగా సరిత తదితరులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సంఘం కొత్త కమిటీ ప్రతినిధులు శుక్రవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలువగా వారిని శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. – గోల్నాక, నవంబర్ 8

తెలంగాణ సాంస్కృతిక డైరెక్టర్‌కు సన్మానం

నగర ప్రజలు కుల, మతాలు, రాజకీయాలకు అతీతంగా సదర్ ఉత్సవాలను వైభవంగా జరుపుకుంటారని తెలంగాణ సాంస్కృతిక, కల్చరల్ విభాగం డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు.యాదవసేవా సంఘం ఆధ్వర్యంలో నారాయణగూడలో నిర్వహించిన సదర్ సమ్మేళన వేడుకలను నిర్వహించడానికి సహకరించిన మామిడి హరికృష్ణను యాదవసేవా సంఘం ప్రతినిధి చిట్టబోయిన వినోద్‌యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు అశోక్‌యాదవ్, రవీందర్, ఆనంద్,దాస్,పాల్గొన్నారు. – కాచిగూడ, నవంబర్ 8

గాంధీ భవన్‌లో ఘనంగా సీఎం జన్మదినం

సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను గాంధీభవన్‌లో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ కేక్‌కట్ చేసి వేడుకలను నిర్వహించారు. విద్యార్థుల మెస్, కాస్మొటిక్ చార్జీలను పెంచడంతో విద్యార్థులు సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోలను మాస్క్‌గా పెట్టుకుని విద్యార్థులు సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మెట్టు సాయి కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేందుకు గాను సీఎం అనేక ప్రణాళికలను చేపడుతున్నారని వివరించారు. – అబిడ్స్, నవంబర్ 8

ఔషధ మొక్కలతో వ్యాధులు దూరం

నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో కొనసాగుతున్న హెచ్ఎస్ఎస్ ఫెయిర్‌లో ఔషధ మొక్కల ప్రదర్శించడంతోపాటు వాటి ప్రయోజనాలను వివరిస్తున్నారు. యాంత్రిక జీవనంలో మనుషులను వేధిస్తున్న బీపీ, షుగర్, థైరాయిడ్, కీళ్ల నొప్పులు, ఇతర ఆరోగ్యాల సమస్యలను తగ్గించేందుకు అన్ని రకాల మొక్కలను ఇక్కడ ఉంచి వివరిస్తున్నారు. ఈ మొక్కల ఆకులను వినియోగించి ఎలా తగ్గించుకోవచ్చని అఖిల్ వివరిస్తున్నారు. ప్రగతి రిసార్ట్స్‌కు చెందిన ఈ మొక్కలను ప్రదర్శనలో ఉంచారు. – అబిడ్స్, నవంబర్ 8

ముగిసిన వర్క్‌షాపు

మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఐఓటీ సిస్టమ్స్ డిజైన్‌పై మూడు రోజులపాటు నిర్వహించే వర్క్‌షాపు ముగిసింది. కళాశాల ఈఈఈ విభాగం, ప్రజ్ఞాత్మిక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఇండస్ట్రియల్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సహకారంతో ఐఓటీ సిస్టమ్స్ డిజైన్‌పై ఈ నెల నాల్గవ తేదీన ప్రారంభమైన వర్క్‌షాపు శుక్రవారం ముగిసింది. వర్క్‌షాపు ప్రత్యేకంగా ఈఈఈ విభాగం ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని ఈఈఈ హెచ్‌ఓడీ మస్తానమ్మ తెలిపారు. ఐఓటీ సిస్టమ్‌లను నడిపించే సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ బాగాల గురించి విద్యార్థులు లోతైన జ్ఞానాన్ని పొందారని తెలిపారు సెషన్‌లో ప్రయోగాత్మక శిక్షణ, విద్యార్థులు, వాస్తవ ప్రపంచ సాధనాలు, పరికరాలతో పని చేసేలా చేయడం వంటి వాటిని కవర్ చేసినట్లు పేర్కొన్నారు. – అబిడ్స్, నవంబర్ 8

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్‌లో అదనపు ఎస్పీ

అబిడ్స్, నవంబర్ 8: ట్రాఫిక్ పోలీసులు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. అబిడ్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జీపీఓ వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించి హెల్మెట్ ధరించనివారిని, రాంగ్ రూట్‌లో వాహనాలు నడిపిన వారికి అబిడ్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్‌తో కలిసి ట్రాఫిక్ అదనపు ఎస్పీ మాజిద్ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ అదనపు ఎస్పీ మాజిద్ మాట్లాడుతూ.. హెల్మెట్ ధరించడం వలన జరిగే నష్టాల గురించి వివరించారు. ట్రాఫిక్ నియమనిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలని కోరారు. అంతకు ముందు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారికి చలానాలను విధించారు.

నాంపల్లి మైదానంలో జనహిత ట్రస్ట్ సేవలు

నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జరుగుతున్న ఫెయిర్‌లో జనహిత సేవా ట్రస్ట్ వారు స్టాల్‌ను ఏర్పాటు చేసి ట్రస్ట్ సామాజిక సేవా కార్యక్రమాలను వివరిస్తున్నారు. ట్రస్ట్ వ్యవస్థాపక సభ్యులు నరసింహ మూర్తి మాట్లాడుతూ.. గాంధీ ఆసుపత్రిలో రోగి సహాయకులు వారి కుటుంబ సభ్యులకు రోజుకు 200 మందికి ఉచితంగా వసతి భోజనం అందిస్తున్నామని తెలిపారు. మహిళా సాధికారత శిక్షణ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ తరగతులు బస్తీలలో హంస వాహిని సంస్కార తరగతులు, ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. – (అబిడ్స్, నవంబర్ 8)